

తుళ్లూరు లింగాయపాలెం రీచ్‌లో భారీగా నిల్వ ఉన్న ఇసుక లాట్లు



ఇసుక.. ఐదేళ్లుగా విసిగించింది. ఇసుక అందక భవన నిర్మాణదారులు అష్టకష్టాలు పడ్డారు. ఇసుక లేక పనులు జరగక కూలీలు ఉపాధి కోల్పోయారు. అలాగని ఇసుక తవ్వకాలు జరగలేదా అంటే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైసీపీ నేతలు ఇష్టా రీతిన నదీగర్భాలను కుళ్ల బొడి చేశారు. ఇసుకాసురులుగా మారిన నేతలు పర్యావరణ అనుమతులను పట్టించుకోకుండా అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకుని రూ.కోట్లు బొక్కేశారు. చివరకు కోర్టులను కూడా మాయ చేసి రీచ్‌లను చెరపట్టి ఇసుకను టన్నుల్లో తవ్వి తరలించేశారు. ఒకవైపు స్థానికంగా ఇసుక అందక అల్లాడుతున్నా పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఇసుకపై దృష్టి సారించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో బంగారంగా మారిన ఇసుక కష్టాలను తీర్చి ఇకపై పూర్తి స్థాయిలో ఉచితంగా అందు బాటులోకి తేచ్చేలా కూటమి ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇసుక బంగారం కాదు.. అందరికీ అందుబాటులో ఉండేలా చేసింది. ఉచితంగా ఇసుక అందివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు కసరత్తు చేపట్టారు.

ఇసుక.. ఇక్కట్లకు తెర

ఐదేళ్ల కష్టాలు ఇక తీరినట్లే

- రేపటి నుంచి ఉచిత ఇసుక విధానం
- రీచ్‌లు, స్టాక్‌పాయింట్ల ఖరారుపై కలెక్టర్ల సమీక్ష
- రేపటి నుంచి మొదట వచ్చిన వారికి తొలిగా సరఫరా
- ఒకరికి రోజుకు 20 టన్నులు వరకు పరిమితి

నాడు దోపిడీ.. నేడు పారదర్శకంగా

ప్రకృతి వరప్రసాదమైన ఇసుక బంగారమైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుకను దోచుకున్నారు. సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేసి కోట్లు దండుకున్నారు. రీచ్‌ల పేరిట హడావిడి చేసి సామాన్యుడి నెత్తిన పెనుభారం మోపి ప్రభుత్వం చోద్యం చూసింది. ఇసుక దోపిడీ దెబ్బకు మధ్యతరగతి ప్రజలు ఇల్లు కట్టుకుందామన్న ఆలోచననే పక్కన పెట్టేశారంటే పరిస్థితి ఏవిధంగా తెలుసుకోవచ్చు. ఇక భవన నిర్మాణాల మీద ఆధారపడిని వేలాది మంది కార్మికులు పనులు లేక అల్లాడిపోయినా గత ప్రభుత్వం ఇసుక ఇక్కట్లపై దృష్టి సారించలేదు. కష్టనష్టాలకు ఓర్చి, అధిక మొత్తం చెల్లించి ఇసుకను కొనుగోలు చేసిన ఆ మొత్తాలు కూడా వైసీపీ నేతల జేబుల్లోకి చేరాయి తప్పితే ఖజానాకు జమ కాలేదు. ఏ చెల్లింపుల్లోనూ పారదర్శకత లేదు. ఏ రీచ్‌ల దగ్గర ప్రభుత్వ పర్యవేక్షణ లేదు. ఈ పరిస్థితుల్లో పూర్తి పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉండేలా ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి అమలు చేయనున్నది. నేరుగా నగదు తీసుకునే అవకాశం లేకుండా లోడింగ్ ఛార్జీలను యూపీఐ/ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఎవరైతే స్టాక్‌యార్డు వద్దకు తొలిగా వస్తారో వారికే ముందు ఇసుకని సరఫరా చేస్తారు. లారీలను సీరియల్‌లో పెట్టించి లోడింగ్ చేయిస్తారు. ఆధార్‌ని ఎంట్రీ చేసుకుని ఒక్కో వ్యక్తికి రోజుకు 20 టన్నుల వరకు ఇసుక మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ప్రతీ స్టాక్ పాయింట్ వద్ద సీసీ టీవీ కెమెరాలను అమర్చుతారు. ఉచిత ఇసుక విధానాన్ని దుర్వినియోగపరిచేలా వ్యవహరించే వారిపై జరిమానాలు విధించేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తప్పు చేస్తే పెనాల్టీల వసూలు

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ మొత్తంలో పెనాల్టీలు వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ట్రాక్టర్‌కు తొలిసారి అయితే రూ.10 వేల వరకు, రెండో సారి అయితే రూ.10001 నుంచి రూ.20 వేల వరకు పెనాల్టీ వసూలు చేస్తారు. 10 టైర్ల లారీకి తొలిసారి రూ.25 వేలు, రెండో సారి రూ.25,001 నుంచి రూ.50 వేల వరకు పెనాల్టీ విధిస్తారు. 10 టైర్ల కంటే ఎక్కువ కలిగిన లారీకి తొలిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.50001 నుంచి రూ.లక్ష వరకు విధిస్తారు. ఇతర యంత్రాలకు తొలిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.50001 నుంచి రూ.లక్ష వరకు పెనాల్టీ ఉంటుంది. ఎద్దుల బండికి తొలిసారి రూ.2 వేలు, రెండోసారి రూ.3 వేలు, ఆ తర్వాత కూడా చేస్తే రూ.5 వేల చొప్పున పెనాల్టీ విధిస్తారు. బిల్లులు ఉండి ఎక్కువ మోతాదులో ఇసుక తరలిస్తే మెట్రిక్ టన్నుకు రూ. 2 వేల పెనాల్టీ వసూలు చేయనున్నారు.

నాడు ఉత్తిత్తి కమిటీలు.. నేడు బాధ్యతాయుతంగా..

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన జిల్లా స్థాయి కమిటీలు ఇకమీదట క్రమం తప్పకుండా సమావేశమవడంతో పాటు ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించనున్నాయి. ఇదే సమయంలో బ్లాక్‌మార్కెట్‌పై కూడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమాలను నియంత్రించేలా ఎక్కడికక్కడ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. వైసీపీ పాలనలో ఇసుక అడ్డగోలు దోపిడీని అరికట్టడానికి పకడ్బందీ వ్యవస్థ అంటూ ఏమీలేదు. అన్నింటినీ అలంకారప్రాయంగా మార్చింది. తనిఖీల కోసమంటూ వైసీపీ తీసుకొచ్చిన సెబ్ విధానం అబాసుపాలైంది. రెవెన్యూ, సెబ్ విభాగాలకు సమన్వయం కొరవడడంతో పాటు వాటి మీద వైసీపీ నేతలు ఎక్కి స్వారీ చేయడంతో అవి తన ఉనికిని చాటుకోలేక పోయాయి.

గుంటూరు, బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందరికీ ఇసుకను అందుబాటులోకి తెచ్చి నిర్మాణరంగాన్ని ప్రోత్సహించగా.. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. దీంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుక అందక నిర్మాణదారులు పనులు నిలిపేశారు.. కూలీలు పనులు లేక అలమటించారు. ఇసుకాసురులుగా మారిన వైసీపీ నేతలు రూ.కోట్లు కొట్టేశారు. ఇసుకను బంగారంగా మార్చేశారు. రీచ్‌ల పేరిట హడావిడి చేసి సామాన్యుడి నెత్తిన ఇసుక విషయంలో పెనుభారం మోపి ప్రభుత్వం చోద్యం చూసింది. వారి కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఐదేళ్ల ఇసుక కష్టాలకు చెక్‌పెడుతూ కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. ఈ క్రమంలో ఉచిత ఇసుకకు సంబంధించిన విధివిధానాలపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా యంత్రాంగాలు కసరత్తు ప్రారంభించాయి. శనివారం జిల్లా స్థాయి ఇసుక కమిటీలతో కలెక్టర్లు ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించారు. మైనింగ్, కృష్ణానది సంరక్షక విభాగం, పోలీసు, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో ఆయా జిల్లాల కలెక్టర్లు చర్చించారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడెక్కడ ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి, వాటిల్లో ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నది అనేది తెలుసుకున్నారు. తక్షణమే ఆయా స్టాక్ పాయింట్లను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇసుక ధరని ఆదివారం నిర్ణయించి ప్రజలకు తెలియజేసిన అనంతరం సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకొద్దామని చెప్పారు. ఆ మేరకు ఆయా శాఖలు ఏర్పాట్లు ప్రారంభించాయి. ఇసుక రవాణా ఛార్జీలను కిలోమీటర్‌కు ఎంత అనేది నిర్ణయం చేయాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లోడింగ్, రవాణా ఛార్జీలు ఎంత అనేది ప్రకటిస్తారు. ప్రస్తుతానికి రీచ్‌ల జోలికి పోకుండా కేవలం స్టాక్‌యార్డుల్లో ఉన్న ఇసుకని ప్రజలకు ఉచితంగా సరఫరా చేయడం పైనే దృష్టి పెట్టాలని అధికారులు నిర్ణయించారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో బృందాలు ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుకని తరలించకుండా చర్యలు చేపట్టనున్నారు. కాగా త్వరలో ఎక్కడెక్కడ ఇసుక పూడిక తొలగించొచ్చు అనేది అధికారులు గుర్తిస్తారు. పట్టా భూముల్లో ఇసుక మేటలు వేసి ఉంటే వాటిని కూడా గుర్తించి అక్కడ ఇసుకని తీసి స్టాక్ పాయింట్ల వద్దకు చేరుస్తారు. వీటి వద్ద నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రస్తుతానికి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకని తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ఆయా ప్రాంతాల్లో చిన్న కార్యాలయాలు తెరిచి సిబ్బందిని అందుబాటులో ఉంచే అవకాశం ఉంది. పోలీసు, రెవెన్యూ విభాగాలు స్టాక్ పాయింట్ల వద్ద పర్యవేక్షించనున్నాయి. రెండు స్టాక్ పాయింట్లకు ఒకరు చొప్పున మైనింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన జిల్లా స్థాయి ఇసుక కమిటీలు ఇకమీదట క్రమం తప్పకుండా సమావేశమవడంతో పాటు ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించనున్నారు. ఇదే సమయంలో బ్లాక్‌మార్కెట్‌పై కూడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమాలను నియంత్రించనున్నారు. సోమ వారం నుంచి కూటమి ప్రభుత్వం తీసుకురానున్న ఉచిత ఇసుక విధానంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుడి సొంతింటికలకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపకరిస్తుందని, రోజువారీ పనిచేసుకుని బతుకునీడ్చే కార్మికుల ముఖాల్లో కూడా ప్రభుత్వ నిర్ణయంపై ఆనందం కనిపిస్తోంది.

మెట్రిక్ టన్ను ఇసుక రూ.265?

అందుబాట్లో 2.35 లక్షల మెట్రిక్ టన్నులు

గుంటూరు(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం తాళ్లాయపాలెం, లింగాయపాలెం, మున్నంగి, గుండిమెడ, కొల్లిపరలో ఇసుక స్టాక్‌పాయింట్లు ఉన్నాయి. వాటిలో 2 లక్షల 35 వేల 650 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నట్లు మైనింగ్ అధికారులు



సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీసీకి కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ డూడీ

అంచనా వేశారు. సగటున ఇసుక లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.265 నిర్ణయించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అయితే దీనిపై శాస్త్రీయంగా లెక్కించి తుది నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఉచిత ఇసుకను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కలెక్టర్ చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఇసుక అందుబాటులో ఉంటుందనే దానిపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. ఇసుక నిల్వలు, లోడింగ్ ఛార్జీలను వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచాలన్నారు. ఇసుక కొరత అన్న మాట రాకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్‌డూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, గుంటూరు ఆర్‌డీవో శ్రీకర్, గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ వందనం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగశేఖర్, డీపీవో శ్రీదేవి, డీటీసీ కరీం, సెబ్, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాజధానిలో ఇసుక కొండలు

- రీచ్‌లను పరిశీలించిన అధికారులు

తుళ్లూరు: రాజధాని పరిధిలోని గ్రామాల్లో అధికారులు ఇసుక కొండలను గుర్తించారు. మండల పరిధిలోని రాయపూడి, లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌లను అధికారులు శనివారం పరిశీలించారు. ఆయా రీచ్‌ల్లో ఉన్న నిల్వలను పరిశీలించారు. రాయపూడి రీచ్‌లో నీటి నుంచి ఇసుక తీసే అవకాశాలున్నాయని, మేటలు కూడా ఉన్నాయని అధికారులు గుర్తించారు. లింగాయపాలెంలో డ్రెడ్జింగ్ చేసి నిల్వ వేసిన నాలుగు భారీ ఇసుక లాట్లను పరిశీలించారు. తాళ్లాయపాలెం పుష్కరఘాట్ వద్ద డంప్ చేసిన ఇసుకను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుధీర్, ఎంపీడీవో శివన్నారాయణ, సర్వేయర్ రామాంజనేయులు, ఆర్ఐ భవానీకిరణ్, తుళ్లూరు సీఐ-2 అనురాధ, ఎస్ఐ అం కమ్మ, ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, ఎస్ఐ రాజేంద్ర, వీఆర్వో కోటేశ్వరావు తదితులున్నారు.

బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్టాక్‌పాయింట్‌లో ఉన్న ఇసుక నిల్వ



లింగాయపాలెం రీచ్‌లో నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధీర్, ఎంపీడివో సర్వే, ఎస్ఈబీ అధికారులు

పీహెచ్‌డీ.. రూ.10 లక్షలు

- ఏఎన్‌యూలో పట్టాలు, పదవుల అమ్మకం
- స్కాలర్స్ నుంచి వైవాకు రూ.వేలల్లో వసూలు
- వైసీపీ వారికే పదవులు.. అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు

చదివితే కాదు.. పైసలతో డిగ్రీలు

గుంటూరు(విద్య), జూలై 6: విద్యకు ఆలయంగా ఉండాల్సిన వర్సిటీలు వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డాగా మారాయి. పైసలు, వైసీపీ నేతల అండతోనే పదవులతో పాటు డిగ్రీలు కూడా పంపిణీ చేశారు. సాధారణంగా పీహెచ్‌డీ రావాలంటే ఏళ్లుగా ఆ అంశంపై పరిశోధనలు చేసి.. అందులో నిష్ణాతులుగా మారి.. వివిధ పరీక్షలు ఎదుర్కొని.. తమ మేధస్సుతో పలువుర్ని మెప్పించాలి. కానీ వైసీపీ హయాంలో అలాంటి వాటితో సంబంధం లేకుండానే యథేచ్ఛగా పీహెచ్‌డీల ప్రదానం జరిగింది. ఈ కోవలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కూడా చేరినట్లు విమర్శలు, ఆరోపణలున్నాయి. నాగార్జున విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగంలో రోజుకో కొత్త దందా వెలుగు చూస్తోంది.



పీహెచ్‌డీ కోసం వచ్చే దరఖాస్తుదారులు వర్సిటీకి రూ.వేలల్లో ఫీజులతో పాటు గైడ్లకు లక్షలు ముట్టచెప్పినట్లు పలువురు స్కాలర్లు వాపోతున్నారు. కొంతమంది గైడ్‌లు థీసెస్ రాయించడానికి స్కాలర్స్ నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం. కొంతమంది గైడ్లు తాము చెప్పిన వారి దగ్గరే థీసెస్ రాయించమని స్కాలర్స్‌పై ఒత్తిడి తెచ్చి 50 శాతం తీసుకున్నట్లు సమాచారం. మరికొందరు థీసెస్ మీద సంతకాలకు రూ.3 లక్షల వరకు వసూలు చేశారని స్కా లర్స్ ఆవేదన. ఎడ్యుకేషన్ విభాగంలో ఓ అధికారికి రూ.10 వేలు ఇస్తేకానీ వైవాలో ప్రశ్నలు అడగరని ప్రచారం ఉంది. మరో అధి కారి కారు చార్జీలు, మూడు నక్షత్రాల హోటల్‌లో విందులంటూ స్కాలర్స్‌ను పిండేశారు. మరికొందరు వైవాకు హాజరు కావాలంటే రూ.20 వేలు ఇవ్వాలని హుకుం జారీ చేస్తు న్నారు. సెమినార్స్ సందర్భంగా రూ.5 వేల నుంచి రూ.25 వేలు దండుకుంటున్నారు. ఇలా వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాలంటే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు స్కాలర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీర విధేయులకే పదవులు..

వర్సిటీ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో ఒక్కరు తప్ప మిగతా అందరూ వైసీపీకి వీర విధేయులే అనే ప్రచారం ఉంది. టీడీపీ వారికి పదవులు ఇవ్వొద్దని ఓ మాజీ అధికారిణి వీసీకి లేఖ ఇచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రి అండతో మరో అధికారిణి ప్రతి పనికి రేటు కట్టి వసూళ్లకు తెగబడుతున్నట్లు ఆరోపణ లున్నాయి. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను బహిరంగంగా విమర్శించడం తోనే ఈమెకు పదవి దక్కినట్లు ప్రచారం.

అక్రమాలు ప్రశ్నిస్తే వేధింపులే..

ఎడ్యుకేషన్ విభాగంలో జరిగే అక్రమాలను పశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని స్కాలర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమందిపై అక్రమంగా కేసులు కూడా బనాయించారు. ఓ అధ్యాపకుడిపై అట్రాసిటీ కేసు పెడితేనే మీ బంధువుకు పీహెచ్‌డీ వస్తుందని డీఎస్పీ స్థాయి అధికారిని ఓ గైడ్ బెదిరించినట్లు సమాచారం. కుల సంఘాల నేతలతో దాడులు సర్వసాధారణమయ్యాయని స్కాలర్స్ వాపోతున్నారు.

వ్యర్థాలు.. వసూళ్లు

- అనధికారికంగా ఘన వ్యర్థాలు సేకరణ
- మాజీ ఎమ్మెల్యే వైసీపీ కార్పొరేటర్ల ప్రమేయం?
- పట్టించుకోని కార్పొరేషన్ అధికార యంత్రాంగం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం వైసీపీ అధికారంలో లేదు. అయినా ఆ పార్టీ నేతలు గతంలో మాదిరిగానే అడ్డదారులు తొక్కుతున్నారు. గుంటూరులో వాణిజ్య, వివిధ సంస్థల నుంచి వచ్చే వ్యర్థాలను సేకరించేందుకు నగర పాలక సంస్థ టెండర్ల ద్వారా పలు ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్టు ఇస్తుంటుంది. జోన్-1లో క్యూబ్ అనే సంస్థ ప్రతినెలా కార్పొరేషన్‌కు రూ.12 వేలు చెల్లించేట్లుగా గతంలో టెండరు వేసి 2020లో కాంట్రాక్టును సొంతం చేసుకుంది. కాగా అప్పటి ఎమ్మెల్యే ఒకరు ఆ సంస్థపై ఒత్తిడి తెచ్చి చెత్త సేకరణ తన అనుయాయులకు దక్కేలా చేశారు. ఓ కార్పొరేటర్ సహాయంతో మూడేళ్లుగా జోన్-1 పరిధిలో ఘన వ్యర్థాల సేకరణ వారే చేస్తున్నారు. ప్రతి షాపు నుంచి నెలకు రూ.200 నుంచి 500 వరకూ, ఆస్పత్రికి రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తుంటారు. తద్వారా ప్రతి నెలా లక్షల రూపాయల ఆదాయం పొందుతూ, కార్పొరేషన్‌కు కేవలం రూ.12 వేలు చెల్లిస్తుంటారు.

వైసీపీ నేతల తీరుతో వైదొలిగిన సంస్థ

క్యూబ్ సంస్థ కాంట్రాక్టు తీసుకున్నా అది ఆ వెంటనే వైసీపీ నేతల అధీనంలోకి వెళ్లిపోయింది. కార్మికుల భద్రతకు సంబంధించి కనీస ప్రమాణాలు పాటించడం లేదని చాలాకాలంగా కాంట్రాక్టు సంస్థ వైసీపీ నాయకులతో గొడవ పడుతోంది. కాంట్రాక్టు నుంచి వైదొలుగుతామని కార్పొరేషన్‌కు దాదాపు 7 సార్లు లేఖలు పంపింది. జూలై 1 నుంచి ఎట్టి పరిస్థితుల్లో తాము పనిచేయబోమని తేల్చి చెప్పింది. అయినప్పటికీ నగరంలో చెత్త సేకరణ మాత్రం ఆగలేదు. జూలై 1 నుంచి ఘన వ్యర్థాల సేకరణ ఆగిపోవాలి. కానీ నగరంలో గతంలో తిరిగిన ట్రాక్టర్లే వ్యర్థాలు సేకరిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఓ వైసీపీ కార్పొరేటరుకు సంబంధించిన ట్రాక్టర్లే ఆ సేకరణ చేపట్టడం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై కొందరు టీడీపీ నాయకులు నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగంలో ఫిర్యాదు చేశారు. ఆ వాహనాలను ఆపాల్సింది ఇంజనీరింగ్ విభాగమని, తమకు సంబంధం లేదని వారు చెప్పినట్లు తెలుస్తోంది. కాగా కాంట్రాక్టు సంస్థ ఆగిపోయి నాలుగురోజులవుతున్నా ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విభాగం టెండర్లను పిలవలేదు. ఇలా ఎవరికి వారు తమకు సంబంధం లేని వ్యవహారంగా తప్పుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వైసీపీకి సేవ చేయడం కోసమే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. కాగా చెత్త సేకరణ నిలుపుదలకు ఆ సంస్థకు తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, త్వరలో కొత్తగా టెండర్లు ఆహ్వానిస్తామని కార్పొరేషన్ ఏఈ రవికిరణ్ వివరణ ఇచ్చారు.



అనధికారంగా చెత్త సేకరిస్తున్న కార్మికులు

రాజధానిలో జంగిల్ క్లియరెన్స్‌కు సీఆర్‌డీఏ టెండర్లు

● ఈ వారంలో పనులు ప్రారంభం ● నెల రోజుల వ్యవధిలో పూర్తి చేయాలి

తుళ్లూరు, జూలై 6: ప్రజారాజధానిగా ప్రపంచస్థాయిలో గుర్తుండిపోవాల్సిన అమరావతిని సీఎం జగన్ రెడ్డి మూడు రాజధానులని అక్కడి నిర్మాణాలను పాడుబెట్టాడు. రైతులిచ్చిన భూముల్లో ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా అడవిని చేశాడు. ఇప్పుడు దానిని క్లియర్ చేయాటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ముందు జంగిల్ క్లియరెన్స్ చేస్తే ఎక్కడ నుంచి పనులు మొదలు పెట్టాలో అర్థమవుతుందని ఇటీవల రాజధానిలో పర్యటించినప్పుడు ఆయన అన్నారు. వెంటనే సీఆర్డీఏ అధికారులు రాజధానిలో ముఖ్యమైన రోడ్ల పక్కన అలుముకున్న ముళ్లకంపను తొలగించారు. ఈ తరువాత రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయటానికి టెండర్లు పిలిచారు. మొత్తం రాజధాని 29 రెవెన్యూ గ్రామాల్లో 26 వేల ఎకరాల్లో కంప తొలగించే ప్రక్రియ వారం రోజుల్లో ప్రారంభం కానుంది. అందుకు 30 కోట్లకు టెండర్లు ఆహ్వానించారు. పెద్దపెద్ద కంపెనీలే టెండర్లు దక్కించుకోనున్నాయి. 30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. రైతుల ప్లాట్లలో రోడ్లను కూడా పూర్తి చేయటానికి జంగిల్ క్లియరెన్స్ అనేది ప్రధానంగా ఉంది. ఆ పనులు పూర్తయితే రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు చేయటానికి సీఆర్డీఏ సన్నాహకాలు చేసుకుంటుంది. వైసీపీ ప్రభుత్వంలో పారద్రోలిన నిర్మాణ కంపెనీలను పిలిచి అభివృద్ధి పనులు వేగవంతం చేయించటానికి సీఆర్డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



సైనికుడు షేక్ రజ్జుబాషాకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆర్మీ అధికారులు తదితరులు

సైనిక లాంఛనాలతో బాషా అంత్యక్రియలు

బాపట్ల, జూలై 6 : పట్టణంలోని భావపురి కాలనీకి చెందిన షేక్ రజ్జుబాషా జమ్ముకాశ్మీర్‌లో హవల్దార్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మరణించాడు. మృతదేహాన్ని శుక్రవారం అర్ధరాత్రి తర్వాత బాపట్లకు తీసుకొచ్చి శనివారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. భావపురికాలనీ నుంచి ఇస్లాంపేట ఈద్గా వరకు బాషా భౌతికకాయానికి అంతిమ యాత్ర నిర్వహించారు. అంతిమయాత్రలో అధికారులు, సైనికులు, మాజీ సైనికులతోపాటు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి పాల్గొన్నారు. బాషా భౌతికకాయంపై పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పంపిన ప్రత్యేకమైన రీత్ (పూలమాల)ను మిలటరీ అధికారి కెప్టెన్ దీపక్‌సింగ్, ఆర్డీవో గంధం రవీందర్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ గుణశీలాషహీద్, మాజీ సైనిక సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తదితరులు రజ్జుబాషా భౌతికకాయం వద్ద జోహార్లు అర్పించారు. అధికారులు, నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్య



ర్యాలీ పేరయ్య (ఫైల్‌ఫొటో)

బాపట్ల, జూలై 6: అప్పుల బాధతాళలేక కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాపట్ల మండలం భర్తీపూడి గ్రామంలో జరిగింది. ఏడెకరాల పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న రైతు ర్యాలీ పేరయ్య (64)కు వ్యవసాయంలో నష్టం వచ్చింది. అప్పులు సుమారు పది లక్షలకు పెరిగిపోయాయి. చేసేదిలేక శుక్రవారం రాత్రి మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగాడు. స్థానికులు గుర్తించి పొన్నూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. భౌతికకాయాన్ని వ్యవసాయశాఖ జేడీ కె.రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్, గ్రామసర్పంచ్ అచంట అమరేష్, రూరల్ సీఐ శ్రీహరి, ఈవోపీఆర్డీ పులి శ్రీనివాసరావు తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు.

మాజీ మంత్రి రజినీపై పోలీసులకు ఫిర్యాదు

చిలకలూరిపేట, జూలై 6 : చిలకలూరిపేట మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన శ్రీరామ్ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మాజీ మంత్రి విడదల రజినీ, ఆమె అనుచరులు తన పొలాన్ని కబ్జా చేశారని శనివారం చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పొలం తనకు ఇప్పించాలని ఆయన ఫిర్యాదులో పోలీసులను అభ్యర్థించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం 1987లో తన తండ్రి పసుమర్రు గ్రామ శివారులో ఎకరం పొలం కొన్నారని, అప్పటి నుంచి ఆ పొలం తన ఆధీనంలో ఉన్నదని తెలిపారు. ఆ పొలాన్ని యూనియన్ బ్యాంక్‌లో తనఖా పెట్టి రుణం కూడా తీసుకున్నానని వివరించారు. అయితే తన పొలాన్ని వేరే వారికి రజినీ, ఆమె అనుచరులు తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేశారని ఆయన ఆరోపించారు. ఇందుకు సంబంధించి తనకు ఎటువంటి డబ్బు కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ విషయం బయటకు చెబితే తనను చంపుతామని బెదిరించినట్టు తెలిపారు. తన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేయకుండా హైకోర్టు నుంచి తాను స్టే కూడా తెచ్చుకున్నట్టుగా వివరించారు. ఈ విషయాలను తాను ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. పోలీసులు తనకు న్యాయం చేస్తారన్న నమ్మకంతో ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

నూజెండ్ల, జూలై 6 : ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తలార్లపల్లి సమీపంలో శనివారం జరిగింది. గుర్రపునాయుడుపాలెం గ్రామానికి చెందిన బొల్లినేని హనుమంతరావు(50) ఇటీవల కొత్తగా ట్రాక్టర్ కొనుక్కొని ఉదయాన్నే ములకలూరు వెళ్ళి గుండ్లకమ్మ నది నుంచి ఇసుక పోసుకొని గుర్రపునాయుడుపాలెం గ్రామానికి తిరిగి వస్తున్న సందర్భంలో అదుపు తప్పి రోడ్డు పక్కన తిరగబడటంతో ట్రాక్టర్ నడుపుతున్న హనుమంతరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

దుర్గి, జూలై 6: అనుమానంతో భార్యను కడతేర్చిన ఘటన మండలంలోని పోలేపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. శనివారం దుర్గి పోలీస్‌స్టేషన్‌లో సీఐ అలహరి శ్రీనివాసరావు ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలేపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బాషాకు గురజాల మండలం దైదకు చెందిన సైదాబితో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్య సైదాబి (45) ఇతరులతో ఫోన్లో మాట్లాడుతుందని భర్త ఖాదర్‌బాషా అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి వారిపురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కోపోద్రిక్తుడైన ఖాదర్‌బాషా మంచం కోడుతో సైదాబి తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సైదాబి తల్లి నాగూర్‌బీ ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు, కారంపూడి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అమీర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హత్య చేసిన అనంతరం భర్త ఖాదర్‌బాషా పరారు కాగా శనివారం అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు. మృతురాలికి ముగ్గురు సంతానం.

పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

వినుకొండటౌన్, జూలై 6 : వినుకొండలోని కిసాన్ ఆగ్రోటెక్ పురుగు మందుల తయారీ కేంద్రంలో శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి 13.85 లక్షల రూపాయల విలువ గల పురుగు మందుల తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారి డీడీఏ సిహెచ్. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తయారీ కేంద్రానికి గతంలో అనుమతులు ఉన్నప్పటికీ, నిల్వలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేక పోవడంతో యర్రంశెట్టి జయరామ్‌కు సంబంధించిన లైసెన్స్ రద్దు చేసినట్టు తెలిపారు. అదే విధంగా శివయ్య స్థూపం సెంటర్‌లోని జయలక్ష్మీ సీడ్స్, లక్ష్మీసీడ్స్ కార్పొరేషన్ షాపుల్లో రికార్డుల్లో నమోదు కాని రూ. 4 లక్షలు విలువ చేసే విత్తనాలను సీజ్ చేశామన్నారు. తనిఖీలను పసికట్టిన ఎరువులు దుకాణదారులు అర్ధాంతరంగా షాపులను మూసివేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ రామ చంద్రయ్య, విజిలెన్స్ ఏవో వరలక్ష్మీ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఆర్వీఆర్‌జేసీ విద్యార్థిని ప్రతిభ



అరికట్ల విజయలక్ష్మీ

గుంటూరు(విద్య), జూలై 6 : బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ వేఫైర్ గ్లోబల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆర్వీఆర్ అండ్ జేసీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో సీఎస్ఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న అరికట్ల విజయలక్ష్మి 25 లక్షల రూపాయల ప్యాకేజీతో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరుగైన విద్యాబోధనతో క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవసరమైన శిక్షణ అందించడంతో టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నిపుణులచే శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగం పొందిన విద్యార్థినిని కళాశాల అకడమిక్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వి శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ సి హెచ్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

రేవులకు 12న జిల్లా పరిషత్‌లో వేలం

గుంటూరు సిటీ, జూలై 6 : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేవులకు సుంకం వసూలు చేసుకొనేందుకు ఈ నెల 12వ తేదీన జిల్లా పరిషత్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ వసంత రాయుడు తెలిపారు. వేలంలో పాల్గొని హక్కు దక్కించుకున్న వారికి ఈ ఏడాది జూలై 1 వ తేదీ నుంచి 2025 మార్చి 31 వ తేదీ వరకు సుంకం వసూలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అచ్చంపేట మండలంలోని చామర్రు (పడవ), చింతపల్లి (పడవ), గింజుపల్లి (పడవ), తాడ్వాయి (పడవ), మాదిపాడు (పడవ), మాదిపాడు(బల్లకట్టు), మాచవరం మండలంలోని గోవిందాపురం (బల్లకట్టు), అమరావతి మండలంలోని దిడుగు,. దరణికోట, కొల్లిపర మండలంలోని వల్లభాపురం రేవులకు 12వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీల్డ్ టెండర్లు దాఖలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని సీఈఓ వెల్లడించారు.



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్‌లో ఘనంగా భారత్ పిచథాన్ 3.0

గుంటూరు (విద్య), జూలై 6 : స్థానిక చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్ కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్, విజ్ఞాన్ టీబీఐ, ఈసెల్, హెడ్‌స్టార్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భారత్ పిచథాన్ 3.0 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ముఖ్యఅతిథిగా హాజరై పారిశ్రామికవేత్తలతో సంభాషించి వారిని ప్రోత్సహిస్తూ, పారిశ్రామికవేత్తలకు విజ్ఞాన్ అందిస్తున్న సహకారం గురించి మాట్లాడారు. అనంతరం హైదరాబాద్‌లోని నాంది వెంచర్స్‌తో ఎంవోయూపై సంతకం చేశారు. అనంతరం ఎంవోయూ పత్రాలను నాంది వెంచర్స్ కో ఫౌండర్ వికాస్ కాట్రగడ్డకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజోర్‌పే కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్స్ లీడ్ ఈషిత మహేశ్వరి మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వారికి కావలసిన ఆర్థిక తోడ్పాటును కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్‌స్టార్ట్ ఫౌండేషన్ ఏపీ లీడ్, అవసర్లాల కో ఫౌండర్ అశ్వతి వేణుగోపాల్, జెల్ప మాక్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జరన్ భగ్వాగర్, ఏజీఆర్ కార్పొరేట్ కన్సల్‌టెంట్స్ సీఈవో వరుణ్ ఏజీ రెడ్డి, నాంది వెంచర్స్ కోఫౌండర్ వికాస్ కాట్రగడ్డ, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడే హంతకుడు !

మాచర్లటౌన్, జూలై 6: వెల్దుర్తి మండలం మిట్టమీదపల్లెలో గత గురువారం జరిగిన పులి చిన వెంకటరెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు చేధించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు మాచర్ల పట్టణంలోని రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు హత్య కేసు వివరాలను శనివారం విలేకరులకు వెల్లడించారు. వెల్దుర్తి మండలం మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన పులి చిన వెంకటరెడ్డి, జింకల పోలిరెడ్డిలు స్నేహితులు. పోలిరెడ్డి గ్రామానికి చెందిన పద్మ అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తన స్నేహితుడైన చిన వెంకటరెడ్డి కూడా పద్మతో సహజీవనం చేస్తూ సన్నిహితంగా మెలిగాడు. ఇది ప్రత్యక్షంగా చూసిన పోలిరెడ్డి వారిపురిని మందలించాడు. కాగా పోలిరెడ్డి కిడ్నీ సమస్యతో బాధపడుతూ తనకు వైద్య చికిత్స చేయించమని చిన వెంకటరెడ్డికి రూ. 3 లక్షల వరకు డబ్బులిచ్చాడు. వైద్య ఖర్చులకు సుమారు రూ. 70 వేలు అవుతాయని, మిగతా డబ్బులు లెక్క చెప్పాలని పోలిరెడ్డి కోరడంతో చిన వెంకటరెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 4న వారిపురు గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి మద్యం తాగారు. వివాహేతర సంబంధం, డబ్బులు విషయాలు మనసులో పెట్టుకున్న పోలిరెడ్డి.. చిన వెంకటరెడ్డి మద్యం మత్తులోకి జారుకోగానే గొడ్డలితో మెడపై విచక్షణారహితంగా నరికి హత్య చేసి పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడు పోలిరెడ్డిని శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మండలంలోని శిరిగిరిపాడు చెక్ పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకొని నిందితుడు పోలిరెడ్డిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ సురేష్, మాచర్ల రూరల్ ఎస్ఐ రాజశేఖర్, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి, వెల్దుర్తి ఎస్ఐ సత్యనారాయణలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పెంపుడు కుక్కకు వాక్సిన్ వేస్తున్న మొహమ్మద్ నసీర్

మూగ జీవాలకు రక్షణ కల్పించండి

● జునోసిస్ డే కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మూగజీవాలు, పెంపుడు జంతుల పట్ల దయతో ఉండాలని, వాటికి రక్షణ కలిపించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం కొత్తపేట పశువుల ఆసుపత్రిలో జరిగిన పెంపుడు జంతువుల వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పెంపుడు జంతువులు, వీధి కుక్కల ఎన్ని ఉన్నాయో గణాంకాలు సేకరించి డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, వాటి వ్యాక్సినేషన్ వివరాలనూ అందులో ఉంచాలని పశు వైద్య అధికారులకు ఆయన సూచించారు. కుక్కలకు రాబిస్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేశారు. గుంటూరు నగరంలో 5000 పెంపుడు జంతువులు, సుమారు 25వేల వీధికుక్కలు ఉన్నాయని, కొంత మంది వీధికుక్కలను అడాప్ట్ చేసుకుని పోషించాలని నసీర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పశుసంరక్షక శాఖ జేడీ సత్యనారాయణ రాజు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యాలను తిప్పికొడతా

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో బావాజి నగర్ నివాసితులపై వైసీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారని, పేదలను ఇబ్బంది పెడితే ఊరుకోబోనని ఎమ్మెల్యే నసీర్ తీవ్ర హెచ్చరికలు చేశారు. అక్కడ ఇళ్ళు కట్టుకోవాలనుకున్నా, కరెంట్ కనెక్షన్ ఇవ్వాలన్నా వారి అనుమతి కావాలని బెదిరిస్తున్నారని ఇటువంటి వాటిని ఉక్కుపాదంతో అణిచివేస్తానని నసీర్ హెచ్చరించారు. పోలీస్, రెవెన్యూ అధికారులను అక్కడికి పిలిపించి, పరిస్థితిని వివరించి కఠిన చర్యలు తీసుకోవాని నసీర్ ఆదేశించారు.



విత్తనాల కంపెనీలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బృందం

రూ. 24.80 లక్షల విలువైన

విత్తనాలు, ఎరువుల అమ్మకాలు నిలిపివేత

● జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వెల్లడి

గుంటూరుసిటీ, జూలై 6: గుంటూరు జిల్లాలో రాష్ట్రస్థాయి తనిఖీ బృందాల దాడుల నేపథ్యంలో రూ.24.80 లక్షల విలువ చేసే మిరప, వరి విత్తనాలు, ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి తనిఖీ బృందాల ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని వట్టిచెరుకూరు, ఫిరంగిపురం మండలాల్లోని విత్తనాలు, ఎరువుల కంపెనీలు, షాపులపై దాడులు జరిగాయని తెలిపారు. ఈ దాడుల్లో సరైన సర్టిఫికెట్లు చూపని, స్టాక్ రిజిస్టర్లలో నమోదు చేయని, అనుమానాస్పద విత్తనాలు, ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏడీఏలు నాగేశ్వరరావు, బాలాజీ నాయక్,విజిలెన్స్ సీఐలు ఎస్.శ్రీనివాసరెడ్డి, మాణిక్యరావు, ఏడీలు లక్ష్మీ, వాసంతి, బీ.గౌతమ్ ప్రసన్న, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.



లోపల జరుగుతున్న పార్కింగ్ అభివృద్ధి పనులు, బయట రోడ్డుపై వాహనాలు

జీఎంసీ ఎదుట పార్కింగ్ రగడ

గుంటూరు, జూలై 6: నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కొన్ని రోజులుగా పార్కింగ్ రగడ నెలకొంటోంది. జీఎంసీ కార్యాలయానికి నిత్యం వివిధ రకాల పనుల కోసం పెద్ద ఎత్తున వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్డుపైనే వదిలేసి వెళ్ళటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. జీఎంసీ ప్రధాన కార్యాలయం లోపల పార్కింగ్ కోసం అభివృద్ధి పనులు చేపట్టారు. దాంతో కొన్ని రోజులుగా ఆవరణం లోపల వాహనాలు పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. అయితే అందుకు అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయకపోవటంతో పనుల కోసం వచ్చే వారు రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్లు పక్కన పార్కింగ్‌తో సమస్య మరింత జటిలమవుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం పార్కింగ్ సమస్య పరిష్కారం దిశగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని వాహనదారులు, నగర ప్రజలు కోరుతున్నారు.



మొక్కలు నాటుతున్న వనమా నరేంద్ర కుమార్, బీజేపీ నేతలు

దేశ ఐక్యతకు కృషిచేసిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్

● 'అమ్మ పేరుతో ఒక్క చెట్టు' కార్యక్రమం ప్రారంభం

గుంటూరు సిటీ, జూలై 6 : దేశ ఐక్యత, ఆశయ సాధనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ అన్నారు. రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో అరండల్ పేట వావిలాల సంస్థ ప్రాంగణంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమ్మ పేరుతో ఒక్క చెట్టు కార్యక్రమాన్ని బీజేపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెద్దింటి కృష్ణ చైతన్య, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, మాతృ వందనం కార్యక్రమ కన్వీనర్ సుకన్య, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంత్రి సుగుణ, పద్మనాభం, వావిలాల సత్యం, యనమండర శ్రీనివాస్, ఈమని మాధవరెడ్డి, బజరంగ్ రామకృష్ణ, వక్కలగడ్డ తిరుమలరావు, పద్మనాభుని రమాదేవి, జితేంద్ర గుప్తా, కృష్ణ మూర్తి, చింతపల్లి వెంకట్, చంద్రశేఖర్, గోకుల్, మందలపు సురేష్, చిన్ని, ఆవుల వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవ కృషీవలుడు జగ్జీవన్‌రామ్

● మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

● జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆనందబాబు, క్రిస్టీనా

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): హరిత విప్లవంలో, వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించడంలో జగ్జీవన్‌రామ్ అందించిన సహకారం అనితర సాధ్యమని మాజీ మమంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేమన్నారు. సామాజిక సమానత్వంపై అందరినీ చైతన్య పరిచేందుకు మహాసభలకు పునాదివేసి ఎన్నో ఉద్యమాలు నడిపారన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు జగజ్జీవన్‌రామ్ అని కొనియాడారు. వెనుక కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, కత్తెర సురేష్, గోళ్ళ అరుణ్, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ: భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రిస్టీనా మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికే కాకుండా దేశప్రజలందరి ప్రగతికి ఆయన ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నేత కూచిపూడి మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు జే.పూర్ణచంద్రరెడ్డి, సీ హెచ్ శ్రీనివాసరావు, తోట ఉషాదేవి, కే.విద్యాసాగర్ రెడ్డి, కార్యాలయ ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మస్తాన్‌వలి, నేతలు

గుంటూరు: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం శనివారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ దేశంలో అట్టడుగువర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఉప ప్రధానిగా, రక్షణశాఖతో పాటు అనేక కేంద్ర మంత్రిత్వ పదవులు నిర్వహించి దేశాభివృద్ధికి కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం మస్తాన్‌వలితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొరివి వినయ్‌కుమార్, బిళ్ళా సునీల్, అంబటి రత్తయ్య, ఇంతియాజ్, పాలపాటి అనీల్, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు(విద్య): వెంగళరావునగర్‌లోని మున్సిపల్ స్కూల్లో డాక్టర్ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఆయన పనిచేసిన ప్రతి శాఖలోనూ తనదైన ముద్రతో పనిచేశారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వర రావు, జ్యోతి రాజ్యలక్ష్మి, గీతా రాణి, అనూష సాహితి, గణేష్, వెంకటేశ్వర్లు విద్యా కమిటి ఛైర్మన్ పవన్ పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యూవల్‌కు

దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య),జులై 6: జోన్-3 పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు నూతన విద్యా సంవత్సరంలో రెన్యూవల్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల విద్య ఆర్జేడీ పీ.కళావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసి ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెన్యూవల్ కోసం ఆయా అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జోన్ -3 పరిధిలోని 38 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 10 ఓరియంటల్ కళాశాలల్లో పనిచేస్తున్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

13నుంచి జిల్లా షటిల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 6: గుంటూరు డిస్ట్రిక్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదిల్లో తాడేపల్లిలోని ప్రొ షట్లర్ బ్యాడ్మింటన్ అకాడమీ నందు జిల్లా షటిల్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలను జరుపుతున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దామచర్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల, బాలికల అండర్- 11, 13, 15, 17, 19, మహిళలు, పురుషుల +35, 40+, 45+, 50+, 55+, వెటర్నరీ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని అన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల్గిన క్రీడాకారులు తమ పేర్లను ఈ నెల 12వ తేది సాయంత్రం 5గంటల లోపు పంపాలని అన్నారు. ఇతర వివరాలకు 92929 09888, 99595 96555 అనే నెంబర్లును సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు),జూలై6: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం కళాలయ మెలోడీస్ వారి ఆధ్వర్యంలో 24వ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏవీ.రత్నాజీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులు సీ హెచ్ మస్తానయ్య, వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారభించారు. గాయకులు పీ మొగిలి, ఈ భరత్ రెడ్డి, ఏ వీ రత్నాజీ పలు సినీ భక్తి గీతాలను ఆలపించారు కీబోర్డ్‌పై కే.రవి, తబలా.పై ఎస్.వెంకట్, పాడ్స్‌పై ప్రసాద్ వాయిద్య సహకారాన్ని అందించారు.

స్థానిక గోరంట్ల, శ్రీ పద్మావతి అండాళ్ వెంకటేశ్వర స్వామి, కాశీ అన్నపూర్ణేశ్వరీ అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, పి ఎల్ నరసింహారావు, దయామణి పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



వేదికపై పలువురు వైద్యులు, నిర్వాహక సిబ్బంది

మాదల శకుంతల భాస్కర్

నర్సింగ్ కళాశాలలో క్లాసులు ప్రారంభం

గుంటూరు, జూలై 6: నగరంలోని తారకరామనగర్, శ్రీనివాసనగర్ కాలనీల్లోని మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలలో 18వ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం శనివారం జరిగింది. నూతనంగా చేరిన విద్యార్థినులతో ఫ్లోరెన్స్ నైటింగేల్‌పై ప్రమాణం చేసి క్లాసుల్లో పాఠాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నర్సింగ్ విద్య ప్రాధాన్యాన్ని వక్తలు వివరించారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల వ్యవస్థాపకుడు, ఉపాధ్యక్షుడు మాదల రత్నగిరిబాబు, డాక్టర్ పాటిబండ్ల శివాజీ, కార్డియా లజీ డాక్టర్ ఎన్.శ్రీకాంత్, కార్డియాలజిస్ట్ కొత్తపల్లి సుశీల, డాక్టర్ కొండ బోలు కృష్ణప్రసాద్, నామినేని కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, జాయింట్ సెక్రటరీ మాదల చైతన్య, కళాశాల సిబ్బంది, జన చైతన్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సునీల, అధ్యాపకులు, విద్యార్థులు,

మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ

● ఏఎల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏస్తేరు సునీల

గుంటూరు(విద్య),జులై 6: మొక్కల నాటి వాటిని సంరక్షించినప్పుడే మానవ మనుగడ సాధ్యమౌతుందని ఏల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఏస్తేరు సునీల తెలిపారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అంబేద్కర్ సెంటరులోని కళాశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏస్తేరు సునీల మాట్లాడుతూ జీవ వైవిధ్యం మొక్కల పెంపకంతోనే సాధ్యమని, పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ డాక్టర్ ఎఎస్ వెస్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య)జులై 6: పాఠశాల స్థాయి విద్యార్థినీ, విద్యార్థుల్లో సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి పెంపొందించడానికి ఇన్‌స్పైర్ అవార్డులు అందిస్తున్నామని ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పీ. శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థులు ఇందుకు అర్హులని, వారి వయసు 10 నుంచి 15 సంవత్సరాల మధ్య ఉండాలని సూచించారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ ఇన్‌స్పైర్ మానిక్ పోర్టల్ ద్వారా, www.inspireawards-dst.gov లింక్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15లోగా దరఖాస్తులు పంపాలని సూచించారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ టీచర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నామినేషన్స్ పంపాలని సూచించారు. ఇతర సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి గౌసుల్ మీరా (7842869407)ని సంప్రదించాలని తెలిపారు.

వ్యభిచార ముఠా అరెస్టు

గుంటూరు(విద్య), జూలై 6: స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటీ అగ్రహారం జీరో లైన్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కొంతకాలంగా ఉమాదేవి అనే మహిళ స్థానికంగా ఇల్లు అద్దెకు తీసుకొని పలువురు మహిళలను పిలిపించుకొని వ్యభిచార కార్యకలాపాలు సాగిస్తుంది. పక్కా సమాచారంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఉమాదేవితో పాటు మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.

నల్లపాడు సీఐగా వెంకన్న చౌదరి

గుంటూరు(విద్య), జూలై 6: నల్లపాడు సీఐ నరేష్‌కుమార్‌పై వేటు పడింది. ఆయనను ఆకస్మికంగా బదిలీ చేసి ఆయన స్థానంలో డీ వెంకన్న చౌదరిని నియమించారు. గత ఎన్నికలకు ముందు దిశ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ నరేష్‌కుమార్‌ను నల్లపాడు స్టేషన్‌కు బదిలీ చేశారు. తాజాగా ఆయన సివిల్ వివాదంలో తలదూర్చినట్లు ఆరోపణలు రావడంతో నరేష్ కుమార్‌ను వీఆర్‌కు పంపి ఆ స్థానంలో వెంకన్నచౌదరిని సీఐగా నియమించారు. ఆదివారం వెంకన్నచౌదరి బాధ్యతలు స్వీకరించనున్నారు.

స్కూలు యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు

గుంటూరు(విద్య),జులై 6 స్థానిక రాఘవేంద్ర ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యానికి డీఈవో పీ. శైలజ శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలలో వసతుల లేమీ, బోగస్ హాజరు, మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు, నాలుగు పోస్టులకు అనుమతులు తెచ్చుకుని ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని, దీని అనుమతి రద్దుచేయాలని ఇటీవల ప్రజాఫిర్యాదుల విభాగానికి ఫిర్యాదు రాగా నోటీసులు జారీ చేశామన్నారు. సమాధానం ఇచ్చేందుకు ఏడు రోజుల గడువు ఇచ్చామని డీఈవో తెలిపారు.

భారతీయ న్యాయ సంహిత అమలును నిలిపివేయాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ

గుంటూరు(తూర్పు), జూలై 6: కేంద్రం తీసుకోచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుతో పాటు భారతీయ న్యాయ సంహిత 2023 అమలు నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పీ. దీవెనరావు అధ్యక్షతన ఆ యూనియన్ తూర్పు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ పీఎఫ్ జరిమానాల విషయంలో గతంలో ఉన్న 25 శాతంను ఒక శాతం నుంచి ఐదు శాతం వరకు తగ్గించిందన్నారు. దీంతో భవిష్యత్తులో కార్మికులకు పీఎఫ్ కూడా అందుబాటులో లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో సీఐటీయూ నేతలు కే.శ్రీనివాసరావు, టీ.శ్రీనివాసరావు, రోజమ్మ, జిలాని, ప్రమీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై నేతాజీ, పాల్గొన్న యూనియన్ నాయకులు

రాజధాని రైతు ఇంటిలో చోరీ

● బంగారు ఆభరణాలు అపహరణ ● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

గుంటూరు(విద్య), జూలై 6: స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్ మూడో లైన్‌లోని ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాజధాని ప్రాంత రైతులు పాదయాత్రగా తిరుపతి వెళుతుండటంతో విద్యానగర్ 3వ లైనులో ఉంటున్న రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంకు చెందిన గుజ్జర్లపూడి సురేష్ కుటుంబం ఆ పాదయాత్రలో పాల్గొంది. శనివారం ఉదయం ఇల్లు ఊడ్చేందుకు పనిమనిషి రాగ తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో పని మనిషి సమాచారం ఇవ్వడంతో సురేష్ కుటుంబం వెంటనే గుంటూరు చేరుకుంది. దొంగలు వెనుక వంటగది కిటికీలోనుంచి దోటి కర్రతో లోపల గడియతీసి తలుపు తెరిచారు. లోనికి వచ్చిన దొంగలు బీరువా పగలగొట్టి అందులోని సుమారు 9 సవర్ల బంగారు ఆభరణాలు, డైమండ్ రింగు, డైమండ్ చెవి దిద్దులు అపహరించుకుపోయారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డీజీపీ తిరుమలరావుకు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేస్తున్న కేసన శంకరరావు, క్రాంతికుమార్ తదితరులు

డీజీపీని కలిసిన బీసీ సంఘ నేతలు

గుంటూరు, జూలై 6: ఇటీవల రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన ద్వారకా తిరుమలరావును మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేసన శంకర రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీ కులాలపై జరిగిన దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలు తిరిగి పునరావృతం కాకుండా, శాంతి భద్రతలు కాపాడాలని డీజీపీని కోరారు. నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరైన తిరుమలరావును డీజీపీగా నియమించటంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభినందనలు తెలియజేశారు. గత ఐదేళ్ళుగా కుల, మత, వర్గ బేధం లేకుండా అసాంఘీక శక్తులు, అరాచక పరిస్థితులు కల్పించారని ఇలాంటి వారిపై ఉక్కుపాదంతో అణచివేయాలని, శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చట్టబద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, పలువురు సంఘం నాయకులు ఉన్నారు.

టెట్ పరీక్షకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),జులై 6: రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్, మైనారిటీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థినీ విద్యార్థులకు ఏపీ టెట్ 2024 పరీక్షకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లును అందిస్తున్న మైనారిటీ ఆలోచన సమితి, డిజిటల్ వ్యాలీ వ్యవస్థాపకులు షేక్. ఆసిఫ్ రెహమాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు గుంటూరు ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఈనెల 8 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఉర్దూ, తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు టెట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన దరఖాస్తు జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఆంధ్ర ముస్లిం కళాశాలలోని రీజనల్ సెంటర్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం 90308 72696, 94414 53286, సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న నాసర్‌జీ, పాల్గొన్న విద్యార్థి సంఘ నాయకులు

జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్

గుంటూరు(తూర్పు), జూలై 6: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీపై చర్యలు తీసుకోవాలని ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదరు డీడీపై ఏసీబీ వారు కేసు నమోదు చేశారని, అయినా ఆయననే డీడీగా కొనసాగించడం సమంజసం కాదన్నారు. పైగా బీసీ వెల్ఫేర్, గిరిజన సంక్షేమశాఖల ఇన్‌చార్జీ బాధ్యతలను ఆయనకు అప్పగించారని మండిపడ్డారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసే క్రమంలో అభ్యర్థులు వద్ద డీడీ లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని పోస్టులు భర్తీచేశారని ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు వారంరోజులలో దీనిపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గ సాయి, అజయ్, గణేష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



మిర్చి విత్తనాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మిర్చి విత్తనాలు స్వాధీనం

గుంటూరు(తూర్పు), జూలై 6: స్టాకు బోర్డులో కంటే అధికంగా నిల్వచేసిన మిర్చి విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పెదపలకలూరు గ్రామంలోని శ్రీ సత్య అగ్రిబయోటిక్ ప్రై లిమిటెడ్ గొడౌన్లో శనివారం వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లులు, ఇన్‌వాయిస్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ బోర్డు కంటే అధికంగా నిల్వచేసిన ఎన్‌సీహెచ్-279 రకానికి చెందిన హైబ్రిడ్ మిర్చి విత్తనాలను గుర్తించారు. దీంతో రూ.5,85,500 లక్షల విలువ కల్గిన 645 ప్యాకెట్లను సీజ్ చేసి, సదరు వ్యాపారిపై 6ఏ కేసును నమోదు చేశారు. స్టాక్‌ను జాయింట్ కలెక్టర్‌కు అందించాలని ఏడీఏ బాలాజీ అధికారులుకు ఆదేశాలిచ్చారు. తనిఖీల్లో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఎమ్ సునీల్, విజిలెన్స్ సీఐఎమ్ శ్రీనివాసులరెడ్డి, అర్బన్,రూరల్ మండల వ్యవసాయ అధికారులు సునిల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజకీయ శిక్షణా తరగతులు

గుంటూరు(తూర్పు), జూలై 6: సీపీఎం కార్యకర్తల జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగులు ఈ నెల 7,8 తేదీలలో స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జరుగుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తరగతులకు శాఖ కార్యదర్శులు, మండల పట్టణ కమిటీ సభ్యులు, ఎంపికయిన కార్యకర్తలు తప్పక రావాలని ఆయన కోరారు. ప్రస్తుత సామాజిక పరిస్థితులు, రాజకీయ పరిణామాలు, ఆర్థిక సంస్కరణల ప్రభావాలు తదితర అంశాలు, ప్రజాసమస్యలపై ఆందోళనలు వంటి అంశాలపై ఈ శిక్షణా తరగతులల్లో వక్తలు ప్రసంగిస్తారని పాశం రామారావు తెలిపారు.

అందర్నీ కడుపుబ్బా నవ్వించే డార్లింగ్



నిర్మాతలుగా 'హను-మాన్' చిత్రంతో సూపర్‌హిట్ అందుకున్నారు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య. లేటెస్ట్‌గా ప్రియదర్శి, నభానటేశ్ జంటగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'డార్లింగ్' చిత్రాన్ని నిర్మించారు. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉప శీర్షిక. అశ్వనీ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చైతన్య మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

'కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా. యూత్, ఫ్యామిలీ ఇలా..ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా సినిమాను దర్శకుడు తీర్చిదిద్దారు. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. ఈ పాత్రలకి ప్రియదర్శి, నభానటేశ్ సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. సినిమాలో ఇద్దరి క్యారెక్టర్లకీ సమ ప్రాధాన్యత ఉంటుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. వివేక్ సాగర్ సంగీతం సినిమాకు స్పెషల్ హైలైట్. 'హను-మాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది. ఈ సినిమాలో హనుమంతుడి పాత్రలో ఎవరు నటిస్తారనేది మాత్రం సస్పెన్స్" అని చెప్పారు.

అనాథలే స్టార్స్

సంజయ్ శ్రీరాజ్‌ను హీరోగా, ప్రియా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు ధర్మ మాట్లాడుతూ 'నెల్లూరులో చిత్రాన్ని నిర్మించాం. ఓ గల్లీలో నివసించే అనాథలు ఎదుర్కొనే సమస్యలను



చిత్రంలో వివరించాం' అని చెప్పారు. చిత్ర నిర్మాత డాక్టర్ అరవేటి యశోవర్ధన్ మాట్లాడుతూ 'క్రైమ్ డ్రామా చుట్టూ చిత్రకథ నడుస్తుంది. ఇందులో నాలుగు పాత్రలు ప్రముఖంగా ఉంటాయి. అనాథలైన వారి జీవితాలు ఎలా ఎవరి వల్ల మలుపు తిరిగిందో చూపించాం. మాస్ ఆడియన్స్‌కు నచ్చేసినిమా ఇది' అని చెప్పారు.

దర్శకధీరుడిపై డాక్యుమెంటరీ



దర్శకధీరుడు రాజమౌళిపై ఓ డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ ఖన్నా దర్శకత్వంలో 'ద మోడరన్ మాస్టర్స్' పేరుతో ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తోంది. ఆగస్టు 2న ఇది విడుదల కానుంది. దర్శకుడిగా రాజమౌళి ప్రయాణాన్ని.. ఆయన ఇండియన్ సినిమాపై చూపిన ప్రభావాన్ని ఇందులో చూపించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో రాజమౌళి గురించి ఆయన బంధుమిత్రులు, దర్శకులు జేమ్స్ కామెరూన్, రుస్సో బ్రదర్స్, హీరోలు రానా, ప్రభాస్ తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు.

బడ్డీ హార్ట్ టచింగ్ సాంగ్



అల్లు శిరీష్ నటించిన తాజా చిత్రం 'బడ్డీ' ఈ నెల 26న విడుదల కానుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని జ్ఞానవేల్ రాజా, అధన నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'చూసాలే నాలో నీ కలనే.. దాచాలే దాచాలే నాలో ఆ కలనే' అంటూ సాగే ఈ హార్ట్ టచింగ్ సాంగ్‌ను సాయి హేమంత్ రాశారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచి ఐరా ఉడిపితో కలసి పాడారు. గాయత్రి భరద్వాజ్, అజ్మల్, అమీర్, ప్రిషా రాజేశ్ సింగ్, ముఖేశ్‌కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నేహా జ్ఞానవేల్ రాజా సహ నిర్మాత.

ఆధారాలు సమర్పించండి..



హీరో రాజ్‌తరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళకు నోటీసులు

సినీ హీరో రాజ్‌తరుణ్ తనను మోసగించాడంటూ ఫిర్యాదు చేసిన లావణ్య అనే మహిళకు నార్సింగ్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలను విచారణ నిమిత్తం తమకు సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. లావణ్య ఆధారాలు సమర్పిస్తేనే ఈ కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుంది. లేదంటే కోర్టు అనుమతితో పోలీసులు కేసును చట్ట ప్రకారం మూసివేస్తారు.

శేఖర్ కమ్ముల చేతుల మీదుగా...



సాయితేజ కల్వకోట, పావని కరణమ్ జంటగా నటిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ హాస్యభరిత వ్యంగ్య చిత్రాన్ని యాడ్ ఫిల్మ్‌మేకర్ ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొద్దుల నిర్మించారు.శుక్రవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'సోడు సోడు' పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ పాటకు మంచి సాహిత్యంతో పాటు ఆకట్టుకునే సంగీతం తోడైంది' అని చెప్పారు. 'పూర్తి స్థాయి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రమిది" అని నిర్మాత రామకృష్ణ బొద్దుల తెలిపారు. ఈ పాటకు ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి సాహిత్యం అందించగా, యశ్వంత్ నాగ్‌నారు సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ కుర్మన, డీఓపీ: సందీప్ బొద్దుల.

దిక్సూచి

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించినకౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. టీజీఈఏపీ సెట్/ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ఇబ్బంది ఏమీ లేదు. కోరుకున్న కాలేజీలో, అనుకున్న బ్రాంచీలో సులువుగా సీటు పొందవచ్చు. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన అభ్యర్థులకే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఎలా చేస్తే, మంచి కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీటు వస్తుందన్నది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎదురయ్యే ప్రశ్న. ఈ విషయంలో నిపుణుల మాటేమిటో చూద్దాం.

ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ జాగ్రత్తలు



ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలైనప్పుడు ఇరవై నుంచి ముప్పయ్ ఆప్షన్లు పెట్టుకుంటే చాలు అని ఎక్కువమంది విద్యార్థులు అనుకుంటారు. అయితే అది తప్పని కౌన్సెలింగ్ నిర్వాహకులు పదేపదే చెబుతున్నారు. నిజానికి వందల కొద్ది ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. అలాంటప్పుడు కేవలం కొన్ని ఆప్షన్లు మాత్రమే పెట్టుకుంటే, నష్టం జరిగే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ర్యాంకు వచ్చినప్పుడు విద్యార్థులు కనీసం రెండు, మూడు వందలు, వీలైతే అంతకన్నా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పకుండా వస్తాయన్న వాటికితోడు, అటూ ఇటూగా రావడానికి అవకాశం బాగా ఉన్న కాలేజీలు, బ్రాంచీలను కూడా ఎంచుకోవాలి. ప్రత్యేకించి మనకు రాదనుకున్న బ్రాంచ్ లేదా కాలేజీకి ఎవరూ ఆప్షన్ పెట్టుకోని పక్షంలో పరిస్థితి అనుకూలిస్తే మనకే దక్కవచ్చు.

అవకాశం ఒక్కసారే: ర్యాంక్ పెద్ద సంఖ్యలో వచ్చినప్పటికీ మంచి కాలేజీలు, కోర్సుల విషయంలో రాజీ పడాల్సిన పని లేదు. మనకు నచ్చిన కాలేజీ లేదంటే కోర్సు నుంచి ఆప్షన్లు ఆరంభించవచ్చు. ర్యాంకుల ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుంది. అంటే మొదటి ర్యాంక్ తరవాత రెండో ర్యాంక్ క్యాండిడేట్ ఇచ్చుకున్న ఆప్షన్ల ఆధారంగా అలాట్‌మెంట్ ఉంటుంది. ఉదాహరణకు వందో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ప్రత్యేకించి నచ్చిన కాలేజీలను తనిష్టం వచ్చిన రీతిలో పెట్టుకున్నాడని అనుకుందాం. ఆ అభ్యర్థికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం సీటు కేటాయింపు జరుగుతుంది. అంటే ఆ వ్యక్తిని వందో అభ్యర్థిగా పరిగణిస్తుంది. తనకు ముందున్న 99 మందికి సీట్ల కేటాయింపు పూర్తయ్యాక ఇతని వంతు వస్తుంది. అప్పుడు సీటు కేటాయింపు ఆ వ్యక్తి పెట్టుకున్న మొదటి ఆప్షన్ నుంచి ఆరంభమవుతుంది. ఆప్షన్ నెంబర్ 1, 2, 3.. అలా మొదలవుతుంది. ఆప్షన్ 30 దగ్గర క్లిక్ కావచ్చు. లేదంటే 200 వద్ద క్లిక్ కావచ్చు. ఆ ఆప్షన్‌గా పెట్టుకున్న కాలేజీ, కోర్సులో సీటు లభిస్తుంది. వందో వ్యక్తిగా మాత్రమే ఆ అభ్యర్థికి కేటాయింపు ఆరంభమవుతుంది. ముఖ్యంగా ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో గరిష్ఠంగా ఆప్షన్లకు అవకాశం ఇవ్వడం అందుకోసమేనని గుర్తించాలి. అసలు ఒక్కరూ ఆప్షన్ పెట్టుకోనందున కొన్ని సీట్లు మిగిలిపోయాయని చెబుతూ ఉంటారు. అలాగే ఒక్కరు కూడా చేరని కాలేజీలు లేదా బ్రాంచీల వివరాలను కౌన్సెలింగ్ నిర్వాహకులు అధికారికంగానే ప్రకటిస్తుంటారు. ఆ కాలేజీలు లేదా ఆ గ్రూపులు కొన్ని అంత డిమాండ్ లేనివి కావచ్చు. అలాగే డిమాండ్ ఉన్నప్పటికీ రాదని కొందరు ఆప్షన్లుగా ఇచ్చుకుని ఉండకపోవచ్చు. కారణం ఏమైనా ఆ సీట్లు మొదటి రౌండ్‌లో మిగిలిపోయాయన్నది వాస్తవం.

మొదటి అవకాశమే మంచిది: ఇలాంటి వెబ్ కౌన్సెలింగ్‌లో తొలి ఎంపికే కీలకం. రెండోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, అప్పుడు ఛాన్స్‌లు తక్కువ. కేవలం మిగిలిన సీట్లకు మాత్రమే పోటీపడాల్సి వస్తుంది. అందువల్ల మొదటి కౌన్సెలింగ్ సమయంలోనే కొద్దిగా తెలివిగా వ్యవహరించాలి.

లాస్ట్ ఇయర్ కటాఫ్ చూడాలి: కాలేజీలు, సీట్లవారీగా గత ఏడాది కేటాయింపు సమాచారం చూస్తే మంచిది. అయితే ఇది కేవలం గైడింగ్ ఫ్యాక్టర్ మాత్రమే. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కేటాయింపు జరగాలని లేదు. ప్రత్యేకించి ప్రసిద్ధ కాలేజీల్లో మాత్రం ర్యాంకింగ్‌లో కొద్దిగా అటూ ఇటూగా మాత్రమే మారుతుంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 7 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 10 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 12
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 13
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 16
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 17 - 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 19 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/

తెలంగాణ
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 - 23
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

జయశంకర్ వర్సిటీలో పాలిసెట్ ప్రవేశాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణ పాలిసెట్ 2024 (అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి ప్రోగ్రామ్‌లో 60 శాతం సీట్లు కేటాయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్)లో 447 నుంచి 19998 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 10న, 20015 నుంచి 46924 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 11న, 47062 నుంచి 68151 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 12న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమౌతుంది.

- **కౌన్సెలింగ్ వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన ఫస్ట్ సెమిస్టర్ ఫీజు:** యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రూ.19,460; ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో రూ.22,210.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/r1mnRyKలో చదవండి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దంపతులు

ధూళిపాళ్ల విజయంతో జోగి మొక్కు

పొన్నూరుటౌన్, జూలై 6: పొన్నూరు ఎమ్మెల్యేగా 6వ సారి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన నేపథ్యంలో శనివారం జోగి మొక్కు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసరావు కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామికి జోగి మొక్కు మొక్కుకున్నారు. నరేంద్రకుమార్ విజయం సాధిస్తే గ్రామాల వెంట పాదయాత్రగా జోగి నిర్వహించి తిరుమల వచ్చి మొక్కుబడులు తీర్చుకుంటానని ప్రార్థించారు. నరేంద్రకుమార్ విజయం సాధించటంతో బండారుపల్లి శ్రీనివాసరావు జోగియాత్ర ద్వారా తిరుమల బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబంలో జరిగిన ప్రత్యేకపూజలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల, జ్యోతిర్మయి దంపతులు పాల్గొన్నారు. ఐదు గ్రామాలో జోగి యాత్ర నిర్వహించి అక్కడి నుంచి తిరుమల బయల్దేరి వెళ్లారు.

జైనుల ఉపవాస దీక్షలు ప్రారంభం



సాధ్వీజీలకు స్వాగతం పలుకుతున్న జైన మహిళలు

తెనాలి అర్బన్, జూలై 6: వర్ధమాన మహావీరుని బోధనలు అనుసరించి జైనుల ఉపవాస దీక్షలు మొదలయ్యాయి. ఇందుకోసం తెనాలి వచ్చిన జైన సాధ్వీజీలకు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. సాధ్వీజీ మహిళలు నాలుగు నెలలపాటు జైన ఆలయంలో ఉపవాసం చేస్తూ పట్టణ జైన మహిళలతో కూడా ఉపవాస దీక్షలు చేయిస్తారు. వర్షా కాలంలో చేపట్టే ఈ దీక్ష దేవుని సేవగా పవిత్రంగా భావిస్తారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాధ్వీజీలతో ఊరేగింపు జరిపారు.

గ్రామసభ ద్వారా ప్రజాసమస్యల పరిష్కారం

ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు



గ్రామసభలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు

కొల్లిపర, జూలై 6: ప్రజాసమస్యలను పరిష్కరించటం కోసమే గ్రామసభ ఏర్పాటు చేసినట్లు ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని తూములూరు పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్ణశంకరరావు మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గృహాల వద్ద మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలన్నారు. రోడ్ల పక్కన చెత్తాచెదారం వేయడం వలన దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామసభలో సర్పంచ్ అరుణాబాయ్, పంచాయతీ కార్యదర్శి మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మదేవాలయాన్ని దర్శించిన శాంతిబుషికుమార్



శబరిమల మాలికాపుర దేవస్థానం మేలు శాంతిబుషికుమార్ నంబూద్రికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, భక్తులు

చేబ్రోలు, జూలై 6: చేబ్రోలులో బ్రహ్మ దేవాలయం ఉన్నట్లు తెలుసుకుని స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చానని కేరళలోని శబరిమల మాలికాపుర దేవస్థానం మేలు శాంతిబుషికుమార్ నంబూద్రి చెప్పారు. శనివారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక అయ్యప్పభక్తులు, ఏబీఏపీ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చతుర్ముఖబ్రహ్మలింగేశ్వరస్వామి, నాగేశ్వరస్వామి ఆలయాలను దర్శించుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఆయనను ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా కేరళలోని శబరిమల మాలికాపుర దేవస్థానం మేలు శాంతిబుషికుమార్ నంబూద్రి మాట్లాడుతూ అఖిల భారత ధర్మప్రచార సభ పేరుతో దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సంఘాలను ఏర్పాటుచేసి స్వామివారి సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు తలిపారు. సంఘజాతీయ ప్రధాన కార్యదర్శి అయ్యప్పదాస్ మాట్లాడుతూ నెలకల్ ప్రాంతంలో ఒక్కో రాష్ట్రానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని ఇప్పటికే కేరళ ప్రభుత్వానికి ట్రావెన్ కోర్ సంస్థానాన్ని కోరడం జరిగిందని, త్వరలోనే తెలుగు ప్రజల కోసం విడిది భోజన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకరాచార్యులు, స్థానిక అయ్యప్ప భక్తులు ముక్కాల శ్రీనివాసరెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన సీసీ రోడ్లు.. పట్టించుకోని అధికారులు



అత్తోట సమీపంలో కోతకు గురైన సిమెంట్ రోడ్డు

కొల్లిపర, జూలై 6: సుదీర్ఘ కాలంగా మన్నికగా ఉండాల్సిన రోడ్లు అధికారుల పర్యవేక్షణ లోపంతో అనతికాలంలోనే పూర్తిగా దెబ్బతింటున్నాయి. సీసీ రోడ్లు సైతం దెబ్బతినటంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని అత్తోటలో పది కాలాలు పాటు పటిష్టంగా ఉండవలసిన సీసీ రోడ్డు మూడు సంవత్సరాలకే దెబ్బతింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవతో గ్రామం నుంచి శ్మశానానికి వెళ్లటానికి చెరువు పక్క నుంచి పంచాయతీరాజ్ నిధులు రూ.6లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డును నిర్మించారేగాని రోడ్డు పక్కన సైడ్‌వాల్ నిర్మించక పోవడంతో భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అనేక పర్యాయాలు పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జంతువుల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలి

- పశుసంవర్ధక శాఖ డీడీ పద్మావతి



శునకానికి యాంటీరేబిస్ టీకా వేస్తున్న డీడీ డాక్టర్ పద్మజ, డాక్టర్ నాగిరెడ్డి

తెనాలి రూరల్, జూలై 6: ఇంట్లో పెంచుకునే పెంపుడు జంతువుల పెంపకం పట్ల జంతు ప్రేమికులు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ డీడీ పద్మావతి అన్నారు. శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని పశువైద్యశాలలో ఏర్పాటుచేసిన యాంటిరేబిస్ ఇంజక్షన్‌ను పెంపుడు జంతువులకు అందించే ప్రత్యేక శిబిరాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ జంతువుల నుండి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సోకే వ్యాధులను జునోసిస్ వ్యాధులంటారని తెలిపారు. ఈ వ్యాధులు 250కి పైగా ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనలలో వెల్లడైనట్లు ఆమె చెప్పారు. పెంపుడు జంతువులకు ఎక్కువగా వ్యాపించే వ్యాధుల్లో ఒకటి రేబీస్ వ్యాధి అని వాటి ద్వారా మనుషులకు కూడా ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి సోకిన వారిలో జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, మింగలేకపోవడం, నీటిని చూస్తే భయపడటం, పిచ్చిగా ప్రవర్తించడం వంటి లక్షణాలను గమనించవచ్చన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్నవారికి యాంటి రేబీస్ టీకాను ఐదు డోసులుగా వేసి తిరిగి ఆరోగ్యవంతులగా చేయవచ్చన్నారు. ఈ వ్యాధి కుక్కలకు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వీటి కాటు ద్వారా క్రమేపీ వ్యాధిబారిన మనుషులు పడే ప్రమాదం ఉందన్నారు. జంతుప్రేమికులు ఈ విషయాలను గమనించి తప్పనిసరిగా పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలను వేయించాలన్నారు. ఇందుకు పశువైద్యశాలల్లో ఉచితంగా అందించడం జరుగుతుందని పద్మావతి పేర్కొన్నారు. డాక్టర్ నాగిరెడ్డి పర్యవేక్షణలో పలు శునకాలకు యాంటి రేబిస్ టీకాలను వేశారు. పెద్దసంఖ్యలో పెంపుడు జంతువుల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

మారీసుపేట రైల్వే గేట్లపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



మారీసుపేట రైల్వేగేటును పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్, జూలై 6: మారీసుపేటలోని పినపాడు వద్ద రైల్వేగేట్లపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సభ్యులు కోరారు. శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆ మార్గంలో ప్రయాణించే వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. తరచూ రెండు గేట్లు పడటం వల్ల ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ గంటల కొద్ది నిలిచిపోతుందని చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాదెండ్ల మనోహర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేయించారని, ప్రస్తుతం ఆయనే మంత్రిగా ఉన్నారని బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. పట్టణంలోని చెంచుపేట ఓవర్ బ్రిడ్జి కూడా శిథిల పరిస్థితికి చేరిందని దానిని కూడా నిర్మించేందుకు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి కృషి చేయాలని సంఘ అధ్యక్షుడు దర్శి శివకోటేశ్వరరావు, సభ్యులు శివశంకరరావు, ఆరీఫ్, పేరైడ్డి, అబ్రహం లింకన్ తదితరులు కోరారు.

యువతకు స్ఫూర్తిదాయకుడు జగ్జీవన్‌రామ్

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

పొన్నూరుటౌన్, జూలై 6: నేటి యువతకు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరులో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని నిడుబ్రోలు బ్రిడ్జి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నరేంద్రకుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడిగా జగ్జీవన్‌రామ్ సేవలు దేశం మరువలేదన్నారు. దేశ ఉప ప్రధానిగా, మొట్టమొదటి కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన జగ్జీవన్‌రామ్ ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. అట్టడుగు వర్గం నుంచి అత్యున్నత పదవులను జగ్జీవన్‌రామ్ అలంకరించారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● పెదకాకానిలో ఘన నివాళులు

పెదకాకాని, జూలై 6: దేశ తొలి ఉపప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సేవకులు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం నేటి యువతకు ఆదర్శం అని తెలుగుదేశం మండల పార్టీ నాయకులు తెలిపారు. శనివారం మండల 38వ వర్ధంతి సందర్భంగా పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, అంబేద్కర్ నగర్ లో ఉన్న విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

తెనాలి రూరల్, జూలై 6: స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ మాజీ ఉప ప్రధానిగా దివంగత బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో అన్నాబత్తుని శివకుమార్ ఆ పార్టీ శ్రేణులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అత్తోట చంటి, అక్కిదాసు కిరణ్, యలవర్తి సాంబశివరావు, కఠారి హరీష్, దుబాయ్‌బాబు, వేజండ్ల శ్రీకాంత్, పలువురు కౌన్సిలర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

● అర్బన్ సీఐ పి.భాస్కర్

పొన్నూరు టౌన్, జూలై 6: పట్టణంలోని చిరువ్యాపారులు, తోపుడుబండి వ్యాపారులు, వివిధ షాపుల యజమానులు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు పోలీసులు చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని అర్బన్ సీఐ పి.భాస్కర్ అన్నారు. ప్రతి షాపు నిర్వాహకులు తప్పనిసరిగా రాత్రి 10గంటల లోపు వ్యాపారాలు నిలిపివేయాలన్నారు. సరుకు లోడ్ అన్‌లోడ్ వాహనాలు రాత్రి 10గంటల నుండి ఉదయం 6 వరకే పట్టణంలోకి అనుమతించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, అందుకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు తెలపాలన్నారు. అట్టివారికి బహుమతులు అందించి అభినందనలు తెలపడం జరుగుతుందన్నారు. తాము చేసే సూచనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీఐ భాస్కర్ ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు.

విద్యాహక్కు చట్టంతో సంపూర్ణ అక్షరాస్యత

చేబ్రోలు, జూలై 6: విద్యాహక్కు చట్టం ద్వారా సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని ఎంఈవో రాయల సుబ్బారావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలో నేను బడికి పోతా.. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. కొత్తరెడ్డిపాలెంలో ర్యాలీ ద్వారా ఇంటింటికి వెళ్లి చిన్నారులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఏవీహెచ్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవేణుదత్త సువర్ణ లక్ష్మీహోమ మహోత్సవం

పొన్నూరుటౌన్, జూలై 6: పొన్నూరు పట్టణంలో ఆదివారం ఉదయం 7 గంటలకు శ్రీవేణుదత్త సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రతం, కలశపూజ, హోమ మహోత్సవం జరగనున్నట్లు రామదూతస్వామి భక్తబృందం శనివారం తెలిపారు. అవదూత చక్రవర్తి భగవాన్ శ్రీరామదూతస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ వ్రత మహోత్సవం పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని పరందయ్య కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

వివా విద్యార్థుల వనమహోత్సవం



వన మహోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పెదకాకాని, జూలై 6: వివా ది స్కూల్ విద్యార్థులు జూలై 1 నుండి 6 వరకూ వారం రోజుపాటు వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వివా విద్యార్థులకు చెట్ల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పెంచేలా ప్రోత్సహిస్తూ వనమహోత్సవానికి సంబంధించిన హరిత ప్రచారం, మొక్కలు వాటి ఔషధగుణాలు, వక్తృత్వ పోటీలు తరగతి గదులలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు హరితహారం, మొక్కల ఆవశ్యకతను తెలియపరచే నినాదాలతో గ్రీన్ ర్యాలీ నిర్వహించి, ప్రతి విద్యార్థిచే పాఠశాల ప్రాంగణంలో ఓ మొక్క నాటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న వివా పాఠశాల పాలకమండలి సభ్యురాలు డాక్టర్ వాసిరెడ్డి అరుణప్రియ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆమె మాట్లడుతూ విద్యార్థులు ప్రకృతితో అనుబంధం కలిగి ఉండాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మొక్కలలోని ఔషధగుణాలు అనేక ఆరోగ్యసమస్యలకు పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.హెచ్ సరళ, డైరెక్టర్ ఎల్టి కమాండర్ కె.శ్రీనివాసరావు, ఆధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను విద్యార్థులకు అందించాలి

పెదకాకాని, జూలై 6: అధ్యాపకులు విద్యార్థులకు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతికతను అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యా, శిక్షణామండలి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నందు ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ ఆధ్యాపకులకు కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ప్రోగ్రామింగ్ పై వారంరోజుల శిక్షణ నిర్వహించారు. దీని ముగింపు కార్యక్రమానికి శనివారం ముఖ్యఅతిధిగా బి.నవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.నవ్య మాట్లడుతూ అధ్యాపకులు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలనీ, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. కొత్త ఆలోచనలను, కొత్త అవకాశాలను విద్యార్థులకు అధ్యాపకులు పరిచయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ విభాగం అధ్యాపకుల నుండి సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.టీ.టీ.టీ.ఆర్, చెన్నై ప్రొఫెసర్ బాల సుబ్రమణ్యన్, వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లిఖార్జునరెడ్డి, డైరెక్టర్ రావెల నవీన్, సాంకేతిక విద్యాశాఖ డిప్యుటీ డైరెక్టర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

పట్టణంలో కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

తెనాలి మారీసుపేట, జూలై 6: పట్టణంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన డ్రెయిన్లపై ఆక్రమణల తొలిగింపు కార్యక్రమం కొనసాగుతోంది. స్థానిక బుర్రిపాలెం రోడ్డులో శనివారం మున్సిపల్ అధికారులు డ్రెయిన్‌లపై ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భగా మున్సిపల్ సిటీ ప్లానర్-2 సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ బీ శేషన్న పర్యవేక్షణలో డ్రెయిన్‌లపై ఆక్రమణలను జేసీబీల సాయంతో తొలగిస్తున్నామని తెలిపారు. డ్రెయిన్‌లలో సిల్ట్ పేరుకొని మురుగు నీరు, వర్షపునీరు పారక రహదారులపై మురుగునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రెయిన్‌లలోని సిల్ట్, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి ఈ ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ఎవరూ డ్రెయిన్‌లను ఆక్రమించరాదని, చెత్తను కాల్వలలో వేయరాదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆధికారులు, శానిటేషన్, సచివాలయం, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

పునర్వసు నక్షత్ర దోష నివారణ పూజలు

తెనాలి మారీసుపేట, జూలై 6: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం నందు శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామి) స్వయం పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత పునర్వసు నక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం పునర్వసు నక్షత్రం వారిచే గణపతి పూజ, గణపతి హోమం, రుద్రాభిషేకాలు, నవగ్రహ, శ్రీమహామృత్యుంజయ హోమాలను ఋత్వికులచే నిర్వహించారు. బాలస్వామి ప్రవచిస్తూ పునర్వసు నక్షత్ర దోషాలు ఉన్నవారు ఈ హోమం చేసి నివృత్తి చేసుకోవచ్చుని తెలిపారు. శాంతి హోమం చేయుటవలన జరుగు పలితాలను తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణ మూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, కోనా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యాంప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తెనాలి అర్బన్, జూలై 6: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి శనివారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు గాజుల వెంకయ్యానాయుడు మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం ఆయనకు నిజమైన నివాళి ఇచ్చిందన్నారు. అన్నవరపు వేణు, సాయిగుప్తా, వెంకట్రామయ్య, రవీంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి గణేష్ యూత్ ఆర్థిక సాయం



బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న గణేష్ యూత్ కన్వీనర్ మురళి, నాగభూషణం, వేణు తదితరులు

తెనాలి, మారీసుపేట జూలై 6: కిడ్నీ అనారోగ్య సమస్యతో బాధపడుతున్న బాధితురాలికి అంగలకుదురు గణేష్‌యూత్ ఆర్థికసాయం అందించింది. పట్టణంలోని 7వ వార్డుకు చెందిన సంకా నాగసుకన్య (28) గత కొంతకాలంగా అనారోగ్యసమస్యలతో బాధపడుతోంది. వైద్యశాలలో పరీక్షలు చేయించగా ఆమె రెండు కిడ్నీలు పాడైపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె వైద్యఖర్చులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు గణేష్‌యూత్ దృష్టికి వచ్చింది. దీంతో యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, బొద్దులూరి వేణు, కనగాల నాగభూషణం ఇతర సభ్యులు కలిసి బాధితురాలికి ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి రూ.45వేలు ఆర్థికసాయం అందించారు. వీరవల్లి మురళి మాట్లాడుతూ బాధితురాలి సమస్యపై ఇటీవల మంత్రి మనోహర్ దృష్టికి తీసుకువెళ్లామని, సీఎం చంద్రబాబుతో మాట్లాడి సహాయనిధి నుండి సాయం అందేలా చూస్తానని తెలిపినట్లు మురళి చెప్పారు. దాతలెవ్వరైనా ఆమె వైద్యసేవల కోసం సాయం అందించాలంటే సంకా రామకృష్ణ ఫోన్‌పే నెం.83176 72296కు పంపాలని కోరారు. కార్యక్రమంలో గొల్లపూడి సాయిగిరి, షేక్ సలాం, ముక్కామల సుబ్బయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటిని తాగకండి

● పురపాలక సంఘ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలి, మారీసుపేట జూలై 6: పట్టన ప్రజలు కలుషిత నీటిని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోరాదని తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలో ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ నందు శనివారం పట్టణ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు డయేరియా వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ విద్యార్థులు భోజనం చేసే ముందు తమ చేతులను శుభ్రపరుచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని అన్నారు. మల మూత్ర విసర్జన తరువాత కూడా తప్పనిసరిగా చేతులను శుభ్రపర్చుకోవాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలను వారానికి ఒకసారి మార్చాలని తెలిపారు. దోమకాటు వలన డెంగీ వ్యాధి వస్తుందని, దోమతెరలను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా అధికారులు, పీఎచ్‌సీ వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వో తీరుతో రైతుల ఆందోళన

తెనాలి రూరల్, జూలై 6: మండలంలోని కొలకలూరు సచివాలయం-2లో పనిచేసే వీఆర్వో నిఖిల్ రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. తమ భూమి ఆన్‌లైన్ అవ్వలేదని, అడంగల్ రావడంలేదని.. ఇలా పలు సమస్యలతో వీఆర్వోను సంప్రదించినప్పటికీ వాటిని పరిష్కరించకుండా డాక్యుమెంట్ల పేరుతో కాలయాపన చేస్తున్నాడని విమర్శిస్తున్నారు. ఆయన కోరిన డాక్యుమెంట్లు తెస్తే పొంతనలేని సమాధానంతో విసురుకుంటున్నాడన్నారు. దాదాపుగా సంవత్సరం నుండి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కులధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు కూడా అవసరమైన డాక్యుమెంట్లు పొందుపరిచినా ధ్రువీకరణ పత్రం మంజూరుకు ఆన్‌లైన్ చేయకుండా అప్లైచేసిన వారిపై విరుచుకుపడటంతో వ్యవహారాన్ని తహసీల్దార్‌కు తెలపడంతో ధ్రువీకరణ పత్రాన్ని మంజూరుచేసిన విషయాన్ని గ్రామస్తులు గుర్తుచేశారు. రైతుల సమస్యలు పరిష్కరించలేని ఆ వీఆర్వోను తమ సచివాలయం నుండి మార్చి రైతులకు గౌరవమిచ్చి సమస్యలు పరిష్కరించే అధికారిని నియమించాలని గ్రామ రైతులు సాధనాల సుబ్రహ్మణ్యం, పోకల వెంకట్రావు, గోవిందు సుబ్బయ్య తదితరులు కోరారు.